క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు


దత్తాత్రేయ స్వామి

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని సర్పంచు వరప్రసాద్ అన్నారు. గురువారం బోరు మోటారును బయటకు తీయించి మరమ్మతు చేయించడంతో గ్రామంలో నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. ప్రతి కాలనీలో నీటి సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మాన్యం భూముల వేలంతో పెరిగిన ఆదాయం

జూపాడుబంగ్లా: మండలంలోని రామసముద్రం గ్రామంలో శ్రీవేంకటేశ్వర, ఆంజనేయ స్వామి వార్ల మాన్యం భూములు వేలం వేయడంతో కొంత ఆదాయం పెరిగినట్లు ఈఓ కార్తీక్ తెలిపారు. గురువారం గ్రామంలో శ్రీవేంకటేశ్వర, ఆంజనేయస్వామి వార్లకు చెందిన 15.92 ఎకరాల మాన్యం భూములను ఏడాది పాటు కౌలుకు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో రూ.2వేల ధరావత్తు చెల్లించి ఏడుగురు రైతులు పాల్గొన్నారు. వేలంలో రూ.1,42,500ల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.6,500ల ఆదాయం పెరిగిందన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన మోడల్ పాఠశాల విద్యార్థులు

జూపాడుబంగ్లా: నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)నకు జూపాడు బంగ్లా మోడల్‌స్కూల్ విద్యార్థులు 10 మంది ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. గురువారం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పది మంది విద్యార్థులను ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న సుమారు 50 విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయగా అందులో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, వారిలోంచి 10 మంది ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున అందజేస్తారన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


తిమ్మాపురం పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటుతున్న దృశ్యం

మహానంది: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం గ్రీన్ కోర్ సొసైటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంఈఓ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించిన వారమవుతామన్నారు. ఇప్పటికే తాజా వేసవికాలంలో ఎండ తీవ్రతలను చూశామని, భవిష్యత్‌లో ఎండలు తగ్గించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాములపాడులో కేక్ తినిపించుకుంటున్న రెవెన్యూ అధికారులు


పగిడ్యాలలో తహసీల్దార్‌ను సన్మానించిన రెవెన్యూ సిబ్బంది


కొత్తపల్లిలో రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

అత్మకూరు: నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆత్మకూరు తహసీల్దార్ బాబు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి రెవెన్యూ విధానం కొనసాగుతోందని, స్వాతంత్ర్యం అనంతరం కూడా రెవెన్యూ పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు న్యాయం జరిగేలా సేవలు అందించాలన్నారు. నిష్పక్షపాతంగా విధులు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఇటీవల రిటైర్డ్ అయిన డీటీ మురళీధర్ సింగ్, స్థానిక తహసీల్దార్ బాబును మహిళా రెవెన్యూ ఉద్యోగులు సన్మానించారు. అంతకముందు కేక్‌కట్ చేసి రెవెన్యూ ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. తహసీల్దార్ వెంకటరమణ, మండల సర్వేయర్ భాస్కర్‌లు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది ప్రజలకు సత్వర సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, వీఆర్వోలు, వీఎస్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నాగేశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీనువాసులు, ఇన్‌చార్జ్ ఆర్ఐ చంద్రమౌళి, లక్ష్మాపురం వీఆర్వో భగవాన్‌దాస్, వీఆర్ఏ మధుసూదన్‌లను డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాధిక, జూనియర్ అసిస్టెంట్ షమీలా, వీఆర్వోలు నాగన్న, నరసింహుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


మహానందిలో రెవెన్యూ అధికారులను సన్మానించిన సిబ్బంది

రెవెన్యూ వ్యవస్థ దేశానికే గర్వకారణం

కొత్తపల్లి: రెవెన్యూ వ్యవస్థ దేశానికే గర్వకారణమని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ రెడ్డి, వీఆర్వోలు బాబుమియా, మౌలాలి, వేణు, అశోక్, లింగేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

మహానందిలో ఘనంగా రెవెన్యూ డే

మహానంది: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డేను నిర్వహించారు. తహసీల్దార్ రామచంద్రుడు ఆధ్వర్యంలో రిటైర్డ్ తహసీల్దార్ జనార్దన్ శెట్టి, బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు నాగరాజును రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ సురేంద్రనాథ్ రెడ్డి, ఆర్ఐ శ్వేత, సూపరింటెండెంట్ రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.


ఆత్మకూరు తహసీల్దార్ బాబును సన్మానిస్తున్న మహిళా వీఆర్వోలు

ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ పాత్ర కీలకం


జూపాడుబంగ్లాలో కేక్‌కట్ చేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

జూపాడుబంగ్లా: రైతులు, ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకమైనదని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయాన్ని రంగవల్లులు, మామిడి తోరణాలు, కొబ్బరిమట్టలతో అందంగా తీర్చిదిద్దారు. కేక్‌కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, జూనియర్ అసిస్టెంటు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురం ఎత్తిపోతలపై సమగ్ర నివేదిక అందించాలి


సిద్ధాపురం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: సిద్ధాపురం చెరువుకు సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సిద్ధాపురం చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువు తూమ్‌ల వద్ద కనీసం గ్రీసు కూడా వేయలేదని, ముళ్లకంపలు, చెట్లతో చెరువు నిండిపోయిందన్నారు. కాలువలు, గట్టు పటిష్టత, ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా, పిల్లకాలువల నిర్మాణం తదితర విషయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కడమలకాల్వలో భూముల వేలాలు

మహానంది: నవనందుల్లో ఒకటైన బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలోని శ్రీ శివనందీశ్వర ఆలయానికి చెందిన 16.70 ఎకరాల భూములకు గురువారం వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది వేలాల ద్వారా రూ.2,78,000 రాగా ఈ ఏడాది రూ.3,18,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.40 వేలు ఆదాయం పెరిగిందన్నారు. ఇదే గ్రామంలోని భైరవ స్వామి ఆలయానికి చెందిన 10.70 ఎకరాల భూములకు నిర్వహించిన వేలాల ద్వారా గతేడాది కంటే ఈ ఏడాది రూ.21 వేలు తగ్గినట్లు చెప్పారు. అలాగే శ్రీ చెన్నకేశవ, వెంకటేశ్వర స్వామి ఆలయాలకు చెందిన 35.64 ఎకరాల భూములకు గతేడాది రూ.8,62, 500 రాగా ప్రస్తుతం రూ.8,59,000వచ్చిందన్నారు. బహిరంగ వేలాల కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

కవాతును విజయవంతం చేయండి

కొత్తపల్లి: జూలై 7న తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరిగే కవాతు కార్యక్రమాన్ని మాదిగలందరూ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కె.వి.రమణ, నందికొట్కూరు తాలూకా ఇన్‌చార్జ్‌లు ప్రేమరాజు, ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, నాగన్నల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా జాతీయ నాయకులు కె.వి రమణను మండల ఎమ్మార్పీఎస్ నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటల వల్ల మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ 30 ఏళ్ల ఉద్యమ పోరాటాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు వరంగల్‌లో జరిగే కవాతుకు ఆంధ్రప్రదేశ్‌లోని మాదిగలందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగరాజు, రాజు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, డాన్ శీను, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ద్రాక్ష పండింది


పందిరిపై పాకిన ద్రాక్ష తీగ


తీగకు కాసిన ద్రాక్ష పండ్ల గుత్తి

ఆత్మకూరురూరల్: నిజమే మన ప్రాంతంలో కూడా ద్రాక్ష పండుతోంది. సాధారణంగా అధిక ఉష్ణోగ్రతలలో ద్రాక్ష పండదు అని అంటుంటారు. కానీ ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఒక ద్రాక్ష తీగ చక్కగా విస్తరించి పండ్ల గుత్తులు కాస్తూ ఔత్సాహిక ఉద్యాన రైతులకు ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఉద్యాన మొక్కలు విక్రయించే వ్యక్తి ఒకరు ఆశ్రమం వద్ద భోజనం కోసం వచ్చినపుడు ఈద్రాక్ష మొక్కను ఆశ్రమ నిర్వాహకుడు మహానందికి ఇవ్వడంతో ఆయన దీన్ని ఆశ్రమ ఆవరణలో నాటారు. మొక్క ఏపుగా పెరగడంతో తీగ కోసం పందిరి వేశాడు. పందిరినంతా విస్తరించిన ద్రాక్ష తీగ కాపుకు కూడా వచ్చింది. ఆశ్రమానికి వచ్చే వారు ఈ ద్రాక్ష గుత్తులను ఆసక్తిగా గమనిస్తున్నారు.

మంత్రి ఆనంకు మహానందీశ్వర స్వామి ప్రసాదాలు

మహానంది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణ రెడ్డికి గురువారం శ్రీ మహానందీశ్వర స్వామివారి ప్రసాదాలు అందించడంతో పాటు వేదాశీర్వచనం చేశారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దన్ శర్మ, ఆలయ అధికారులు మంత్రిని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.


మంత్రి ఆనంను సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పండితులు

కేజీబీవీలో సీట్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): కేజీబీవీల్లో సీట్లు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు అధికారులను కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న అవకతవకలపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టాలన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సీట్లు రాక తమ చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. ఒక్కోస్కూల్‌లో కనీసం 20సీట్లను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


మహానందీశ్వర దర్శనార్థం వచ్చిన ఉన్నతాధికారులు

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో కేంద్ర కరవు బృందం సభ్యులు, డిపార్టుమెంట్ ఆఫ్ ఎక్స్‌పెండీచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ (ఐఏఎస్), తాగునీరు, పారిశుద్ధ్యం డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్ఈ) ఆశిష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోని పూజలు నిర్వహించుకున్నారు. నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి వచ్చిన వారికి ఆలయ ఏఈఓ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికి, పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. వేదపండితుల ఆశీర్వచనం చేశారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): క్రాంతినగర్‌లో ఉన్న ఏపీ మో డల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ మల్లికార్జునప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 22వ తేదీలో గా స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని శ్రీలక్ష్మీ పద్మావతి, న్యూ ఎస్‌వీ ఏజెన్సీస్, శ్రీలక్ష్మీవేంకటేశ్వర ట్రేడర్స్ ఏరువుల దుకాణాలను గురువారం ఏఓ రంగనేతాజీ తనిఖీ చేశారు. విక్రయాల బిల్లులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర ట్రేడర్స్‌లో ఓ ఫారాలులేని రూ.3.00 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను ఏడు రోజుల పాటు నిలుపుదల చేశామని ఏఓ తెలిపారు.

నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కదిరి దస్తగిరి


కదిరి దస్తగిరికి నియామక పత్రాన్ని అందజేస్తున్న షేక్ సయ్యద్ బాజీ

చాగలమర్రి: రాష్ట్ర నూర్‌బాషా దూదెకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కదిరి దస్తగిరి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం చాగలమర్రిలోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ నియామక పత్రాలను కదిరి దస్తగిరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో దూదెకుల సామాజిక వర్గం సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సోషియల్ మీడియా ఇన్‌చార్జ్ హుసేన్, జిల్లా ప్రధానకార్యదర్శి డి.దస్తగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు దస్తగిరి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షేక్ ఉమర్ షరీఫ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ షేక్ నసీరుద్దీన్, చాగలమర్రి మండల అధ్యక్షు డు జింకల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతిలో ప్రతిభ చూపిన పేద, ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలని అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు అబ్దుల్ కుద్దూస్ గురువారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నామని, పట్టణ వాసులై ఉండి ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ కార్యాలయంలో జూలై 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జిరాక్స్ కాపీలు, కళాశాలలో చదువుతున్నట్లు ధ్రువపత్రాలు దరఖాస్తుకు జతపరచాలని, పూర్తి వివరాలకు 9866242742 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరారీలో ఉన్న నిందితుల పట్టివేత

శ్రీశైలం : క్షేత్ర పరిధిలో గంజాయి విక్రయం కేసులో ఏ1 ముద్దాయిగా ఉండి పరారీలో ఉన్న తిరుపతయ్య (49)ను గురువారం పట్టుకున్నట్లు సెబ్ సీఐ ప్రసాదరావు తెలిపారు. ఇతను దోర్నాల గ్రామస్తుడని, గతంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి విక్రయించడానికి శ్రీశైలం వస్తుండగా పోలీసులు దాడి చేయగా.. పరారయ్యాడన్నారు. ఇతనిని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు కింద రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అలాగే నాటుసారా కేసులో పరారీలో ఉన్న ఎ.గోవిందు (23)ను కూడా పట్టుకున్నట్లు చెప్పారు.

మహిళ వద్ద నుంచి మద్యం స్వాధీనం

శ్రీశైలంలో మద్యం అమ్ముతున్న రత్లావత్ బుజ్జిబాయ్ (39)ను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 42 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. వన్‌టౌన్ ఏఎస్ఐ గురవయ్య, శంకర్ రఘు నాగవేణి, బాలకృష్ణల సహకారంతో ఆమె ఇంటిపై రైడ్ చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, వన్‌టౌన్ పోలీసులు

ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూరు: శ్రీశైలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి ఉంచి ఐదో తరగతి వరకు 55 మంది విద్యార్థులు, 6 నుంచి 8వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులందరికీ ఒకే ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారని, ఆమె హెచ్ఎం బాధ్యతలు, వార్డెన్ బాధ్యతలు కూడా చూడాల్సి ఉందన్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలకు సబ్జెక్టువారీగా ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండల పరిధిలోని సింగరాజుపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటరమణ (44) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి ఉన్న రెండు ఎకరాలు సొంత పొలంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉండగా.. వారి వివాహానికి, పంటలసాగుకోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చలేక కొంతకాలంగా మనోవేదనతో సతమతమవుతున్నాడు. దిక్కుతోచక ఏమీ చేయలేని పరిస్థితిలో కొత్తపల్లి గ్రామానికి సమీపంలోని ఓ రైతు పంట పొలంలో క్రిమిసంహారక మందు తాగాడు.


కుమ్మరి వెంకటరమణ (ఫైల్)

సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే వెంకటరమణ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి కొత్తపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నాడు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ కేసు నమోదు చేసుకుని విచార చేస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

నష్టపోయాం.. ఆదుకోండి

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీ సాగులో తీవ్రంగా నష్టపోయాం... ఆదుకోవాలంటూ రైతులు కేంద్ర బృందం సభ్యులకు విన్నవించారు. 2023–2024లో రబీలో సాగుచేసిన జొన్న, పప్పుశనగ, మినుము పంట నష్టంపై నివేదికలు పరిశీలించేందుకు కేంద్ర బృందం అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండీచర్ సంచాలకులు చిన్మయ గాట్బెర్, తాగునీరు పారిశుద్ధ్య శాఖ డిప్యూటీ సంచాలకులు ఆశిస్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవిందకుమార్ సోనీ , జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి దొర్నిపాడులోని వెలుగు కార్యలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మిడ్తూరు, బనగానపల్లె, దొర్నిపాడు, గోస్పాడు మండలాలకు సంబంధించిన పంటనష్టం ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం పంట నష్టం వివరాలను నేరుగా రైతులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కొన్నిప్రాంతాల్లో పర్యటించగా కరువు నష్టం తీవ్రంగా ఉందని తెలుస్తుందని, రైతులు తమ సమస్యలను విన్నవించాలని సూచించారు. జొన్న, శనగ పంటలు వేసి తీవ్రంగా నష్టపోయామని, పశువులకు గ్రాసం కొరత వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ రూపంలో ఇవ్వాలని కోరారు. పంటలకాల్వలు సరిగ్గా లేకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని, వెంటనే లైనింగ్ పనులు చేపట్టాలన్నారు.


కేంద్రబృందం సభ్యులకు నష్టం తీరును వివరిస్తున్న ఏఓ

వ్యవసాయాన్ని ఉపాధిహామికి అనుసంధానించాలని రైతులకు ప్రత్యేక రుణాలను ఇప్పించాలని కోరారు. ముఖ్యంగా సిద్దేశ్వరం రిజర్వాయర్‌ను కట్టిస్తే కేసీ కెనాల్‌కు సాగునీరు పుష్కలంగా వస్తుందన్నారు. రబీలో 3,156 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు ఏఓ సునీత కేంద్ర బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. 1,503 హెక్టార్లలలో శనగ, 1,626 హెక్టారల్లలో జొన్న, 140 హెక్టార్లలలో మినుము, 30 హెక్టార్లలలో వరి, ఇతర పంటలు 8 హెక్టార్లలలో నష్టం జరిగిందని కేంద్ర బృందానికి నివేదికలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవమణి, ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి, డీఏఓ మురళీక్రిష్ణ, ఏడీఏ సుధాకర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కొండారెడ్డి, డీహెచ్ఓ నాగరాజు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.